
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





## అమెరికులాసా కథ – 200

## 'అమెరి ''కామన్ సెన్స్' కథ

**మొన్న..2025... జనవరి ఒకటో** తారీకు నాడు మధ్యాహ్నం డాలస్ లో ఒకానొక అత్యాధునిక ఆసుపత్రి లో మా రెండో మనవడు పుట్టాడు. మా రెండో అమ్మాయికి ఇద్దరు ఆడ పిల్లల తర్వాత వీడు మూడో సంతానం. మా పెద్దమ్మాయి రెండున్నర ఏళ్ల కొడుకు మా పెద్ద మనవడు. విశేషం ఏమిటంటే డాలస్ ప్రాంతం లో ఆ జిల్లా మొత్తానికి మా మనవడిదే కొత్త సంవత్సరం లో మొట్టమొదటి పుట్టుక. దాంతో ఆ హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్లు, నర్సులు మహదానందపడిపోయి మా అమ్మాయికి అత్యంత ఖరీదైన పెద్ద గది కేటాయించి, తెగ ఫోటోలు తీయించుకుని "కొత్త సంవత్సరం లో పుట్టిన మొదటి బిడ్డ" అంటూ నానా హడావుడి చేశారు. ఇక మా కుటుంబం హడావుడి చెప్పనే అక్కర లేదు.

ఇక కథాక్రమం బెట్టిదనిన....

అంతకు పది రోజుల ముందే డాలస్ వెళ్ళి మా అమ్మాయికి సహాయం చెయ్యడానికి మా క్వీన్ విక్టోరియా తయారు అయిపోయింది. అప్పుడు "నేనూ వస్తాను" అని నేను పేచీ పెట్టబోతే "అమ్మాయి పురిటికి నువ్వెందుకూ, న్యూసెన్సూ" అని నన్ను ఒక్కడినీ హ్యూస్టన్ లో వదిలేసి బస్సులో తను ఒక్కర్తీ డాలస్ వెళ్ళిపోయింది మా సతీమణి. 'హమ్మయ్య. ఇక నాకు ఇష్టమైన బంగాళా దుంపల ముద్ద కూర లాంటి నా వంట నేనే చేసుకోవచ్చును. కదా" అని సంబర పడ్డాను కానీ 'నీ మొహం' అనేసి, నవ్వేసి నా మానాన నన్ను ఉండనివ్వకుండా పది, పదిహేను రోజులకి సరి పడా నాలుగు పప్పులూ, ఐదు కూరలూ, పులుసులూ, పచ్చళ్ళు చేసి పారేసింది మా క్వీన్ విక్టోరియా. ఎక్కడ పారేసిందీ అనగా....కొన్ని రిఫ్రిజిరేటర్ లో మామూలు చల్లటి అరల్లోనూ, కొన్ని ఏది పెట్టినా గంటలో గడ్డకట్టుకు పోయే ఫ్రీజర్ అరల్లోనూ జాగ్రత్తగా ప్లాస్టిక్ డబ్బాలలో సర్ది పెట్టింది మా సాధ్వీమణి. "ఇదిగో, ఇది ఇవాళ రాత్రికి కాస్త మా అమ్మ రెసిపీ వంకాయ మెంతి పొడి తో చేసిన కూర, ఇది మాలతీ చందూర్ సాంబార్, ఈ గుండ్రం ప్లాస్టిక్ బాక్స్ లో ఉన్నది సూర్యాకాంతం పప్పు చారు, ఆకు

పచ్చ మూత డబ్బా ఏమో యూ ట్యూబ్ లో చూసి చేసిన కలగాపులగం పచ్చడి, మంతెన రాజు గారి మసాలా వెయ్యని మామిడి కాయ పప్పు ఎర్ర మూత డబ్బా" అంటూ ఈ టీవీ, ఆ టీవీ, గాయత్రి వంటలు వగైరా చానెల్స్ చూసి చేసిన వన్నీ లిస్టు రాసి రిఫ్రిజిరేటర్ మీద ఆయస్కాంతం తో అతికించింది. "నువ్వుల నూనె తెగ వేసేసి వేపుడు కూరలు చేసుకుని తిన్నావో ఆ ముగ్గురికీ తెలిసిపోతుంది. తస్మాత్ జాగ్రత్త" అని చూపుడు వేలు శరవేగంతో ఆడిస్తూ బెదిరించింది. ఆ ముగ్గురూ నా నా కార్డియాలజిస్ట్, ఇంటర్నల్ మెడిసిన్ డాక్టరూ....నర్స్ ప్రాక్టీషనర్ గా నా మీద ప్రాక్టీస్ చేస్తున్న మా పెద్దమ్మాయీ. నాకు తెలిసీ ఆ ముగ్గురికీ నా గురించీ, నాకు లేని రోగాల గురించీ, వస్తాయేమో అనే వాటి గురించీ మాట్లాడుకోవవడం తప్ప వేరే ప్రాక్టీస్ లేనే లేదు.

ఇక ఈ ఆట ఇది వరకూ కూడా ఆడుకున్నదే కానీ ఈ సారి కొత్త ఏడాది రాగానే మనం ఏదో ఒక కొత్త పని చెయ్యాలేమో అని మా క్వీన్ విక్టోరియా యాదాలాపంగా అనగానే "అలాంటి రూల్స్ ఏమీ లేవు. కావాలంటే వంట ఈ సారి కాస్త బాగా చెయ్యి" అన్నాను కేవలం సరదాగా...అదే నా కొంప ముంచింది. "ఏమిటా కోతి మాట, హస్బెండూ? నా వంట మీద వంక పెడుతున్నావా? సరే అయితే"....అదన మాట ఈ సారి ఆవిడ పది రోజుల వంట అంతా టీవీ, యూ ట్యూబ్ మరియు పుస్తకాల వంట... "మా అమ్మ రెసిపీ వంకాయ మెంతి పొడి తో చేసిన కూర ఒక్క వంకాయ" తప్ప. ఆ ఒక్కటీ ఆవిడ బస్సులో తినడానికి చేసుకుని, జాలిపడి నాకోసం నాలుగు చెంచాలు పక్కన పెట్టింది.

ఆవిడ డాలస్ వెళ్ళిన మర్నాడు పొద్దున్నే "అన్నట్టు నువ్వు రోజూ పొద్దున్నే మాత్రలతో పాటు తినడానికి ఇడ్లీలు, పచ్చడి చేసి పెట్టాను. పచ్చడి అయిపోతే ఖాళీ కాఫీ సీసాలో పోసిన కారప్పొడి వేసుకో కానీ గ్లాసు జాడీలో ఉన్న ఆవకాయ లాగించెయ్యకు" అన్న మా క్వీన్ విక్టోరియా మాటలు చెవుల్లో గింగురు మన్నాయి. "ఆహా, ఆవిడకి నేనంటే ఎంత ఇదో కదా" అని అదో ఇదిగా నేను చిన్న కంచం లో ఇడ్లీ పొడి వేసుకుని, అందులో అప్పుడే కరిగించిన నేతి చుక్కలు నాలుగు వేసి, ఇడ్లీల కోసం వంటింట్లో ఉన్న రిఫ్రిజిరేటర్ తెరిచాను. అదేమిటో ఆనీ, చల్లటి అరలో ఉన్న అర డజను ప్లాస్టిక్ డబ్బాలూ అన్నీ సాంబార్ రంగులో ఉన్నాయి కానీ ఇడ్లీల సహజ సౌందర్యమైన తెలుపు కానీ, రవ ఇడ్లీ రంగు లా మాసిన తెలుపులో కానీ ఒక్క బాక్స్ కానీ, ప్లాస్టిక్ సంచీ కానీ కనపడ లేదు. వెంటనే గరాజ్ లోకి వెళ్లి అక్కడ ఉన్న రెండో ఫ్రిజ్ లో చూస్తే ఎప్పటి లాగానే పురుగులు పట్టకుండా ఉండడానికి అందులో పెట్టే బియ్యప్పిండి, మైదా పిండి, కంది పప్పు వగైరాలు తప్ప అసలు చేసిన వంట తాలూకు ప్లాస్టిక్ గిన్నెలు ఏమీ లేవు. ఇడ్లీ పిండి రుబ్బిన వాడిని నేనే కాబట్టీ, డాలస్ బస్సులో కూచోబెట్టినప్పుడు ఆవిడ చేతిలో వంకాయ డబ్బా తప్ప మరేమీ లేదు కాబట్టీ నాకు ఎందుకో అనుమానం వచ్చి, వంటింటి ఫ్రిజ్ లో ఫ్రీజర్ అర తెరిచి చూశాను. అదోగో..అక్కడ అలా తలుపు తీయగానే పొగలు గక్కుతూ దర్శనం ఇచ్చింది నాలుగు వాయలు..అనగా సుమారు యాభై తెల్లగా, ఘనీభవించిన గుండ్రంగా ఉన్న వస్తువులతో నిండిన ఒక డబ్బా, ఇంకా తరచి చూడగా దాని పక్కనే మరొక డబ్బాలో ఘనీభవించిన పచ్చడి వలె ఉన్న మరొక డబ్బా కనపడింది. ఆ రెండూ

గడ్డ కట్టుకుని. కట్టగట్టుకుని, ఒకదానికి మరొకట్టి ఆప్యాయంగా అతుక్కు పోయి, మంచు పొగలు కక్కుతున్న పరిస్థితిని గమనించి నా అనుమానం పెనుభూతంగా మారింది. ఆ పెద్ద డబ్బా లో ఉన్నవి ఒకానొకప్పుడు ఆవిరి తో పొగలు గక్కిన ఇడ్లీలు అనియూ, పక్కనే ఉన్న చిన్న డబ్బా ఒకానొకప్పుడు శనగ పచ్చడి అయినోపు అనీ నిర్ధారణకి వచ్చాను. ఆ రెండే కాదు, మొత్తం ఆ అరలో మంచు తో అతుక్కుపోయిన పాతిక పైగా ప్లాస్టిక్ సంచీలూ, డబ్బాలనీ, వాటిల్లో ఆ రెండింటినీ విడదీయడానికి విశ్వ ప్రయత్నం చేసి చేసి సీతా స్వయంవర సమయం లో రావణాసురుడు, ద్రౌపదీ స్వయంవర సమయం లో దుర్యోధనుడు పొందిన అవమాన భంగం పొందాను. మొత్తానికి పెద్ద సుత్తి, కత్తి, కటారుల తో వాటిని విడగొట్టి వంటింటి కౌంటర్ మీద పెట్టగలిగాను.

తర్వాత పూర్తిగా గడ్డ కట్టుకు పోయిన వాటిని మైక్రో వేవ్ లో పెట్టి వేడి చేసిన పావు గంటకి పచ్చడీ, అరగంటకి ఇడ్లీలు యదాస్థితికి వచ్చాయి. తీరా చూస్తే వాటిల్లో రెండు, మూడు ఇడ్లీలు ఎన్నడూ చూడని నీలం రంగులో వెల వెల బోతున్నాయి. ఆ దిక్కుమాలిన యూ ట్యూబ్ లో ఇదేదో కొత్త రకం ఇడ్లీ చేయుట కనిపెట్టిందేమో మా క్వీన్ విక్టోరియా అని భయపడుతూ అవి తినుటయా, మానుటయా అనుకుంటూ చిన్న పటకారుతో వాటిని బయటకి తీసి ప్లేటులో వెయ్యగా వాటి మీద గడ్డ కట్టుకుని ముడతలు పడిపోయిన ఒక కాగితం ముక్క, దాని మీద చెరిగిపోయిన తెలుగు అక్షరాలు కొన్ని....చుట్టూ నీలం చారలు కనపడ్డాయి. ఇదేమిటా అని ఆ మంచు అరలో మిగతా డబ్బాలు, ఇందాకా పైకి తీసిన పచ్చడి డబ్బా కూడా పరికించి చూడగా...అన్నింటిలోనూ ఇదే తతంగం...లోపల ఒక ముడతలు పడి ఘనీభవించిన కాగితం చీటీ...చెదిరిపోయిన అక్షర మాల, కారిపోయిన నీలం రంగు సిరా...ఆ రంగు పట్టిన పదార్థం. ఏ డబ్బాలో ఏ కూర, పచ్చడి, పులుసు ఉన్నాయో నాకు తెలియడం కోసం ఇలా ప్రతీ ప్లాస్టిక్ డబ్బాలోనూ "ఇడ్లీలు", "పొట్లకాయ నువ్వుల పప్పు కూర" అంటూ నీలం రంగు బాల్ పాయింట్ పెన్నుతో  కాగితం మీద రాసి ఆవిడ డబ్బాలలో పెట్టుట, నా రాత బాగా లేక ఆ పెన్ను రాత చలికి కరిగిపోయి, ద్రవ పదార్థంగా మారి వంట పదార్థం లో కలిసిపోవుట...ఇదీ జరిగిన విశేషం...నిజమే కదా...ఫ్రీజర్ లో ఏదైనా కూరగాయలు పెట్టాక, అవి మొత్తం గడ్డకట్టుకు పోయాక, పొట్లకాయకీ, దోసకీ తేడా తెలియదు. సాంబారూ, పప్పు చారూ కూడా ఒకేలా ఉంటాయి. మరి ఏది ఏమిటో తెలియాలి అంటే ఇలా కాగితం మీద రాసుకుని పెట్టుకోవాలి....కదా!. కానీ అది పెన్సిల్ తో రాయాలి, లేదా కంప్యూటర్ లో రాసి ప్రింట్ చెయ్యాలి...ఆ చీటీలు డబ్బా లోపల కాకుండా మూత పైన ఇగురు తో అతికించాలి. అంతే కానీ ఇలా బాల్ పాయింట్ పెన్ను, దయాల్ బాగ్ ఇంకు పెన్నులతో రాసి కూరలోనూ, పులుసులోనూ కలిపేస్తే అన్నీ రంగు మారిపోతాయి కదా!

మొత్తానికి జరిగినది ఏమిటంటే....పది రోజుల పాటు నేను బంగాళా దుంపల ముద్ద కూర, చేమ దుంపల వేపుడు మొదలైన నాకు ఇష్టమైన వంటకాలతో కాలక్షేపం చేసి, మా క్వీన్ విక్టోరియా ఫోన్ చేసినప్పుడల్లా "వావ్, నీ సాంబార్

బ్రహ్మాండం, ఇడ్లీలు సూపర్” అని పొగిడి ఆవిడని సంతోష పెట్టాను కానీ రంగు మార్పిడి గురించి కానీ, వాటికి పట్టిన గతి గురించి కానీ నోరు విప్పితే ఒట్టు. అదే కదా అమెరికామన్ సెన్స్...

**COMMENTS**